# ప్లాట్లు అమ్మబడును!

టి.వీ చానల్స్‌లో వారం రోజులుగా కారు చౌకగా 'ప్లాట్లు' అమ్మబడును... కావలసిన వారు సంప్రతించవలసిన మొబైల్ నెంబరు ఫలానా అని టేప్ రావటం చూచి నా శ్రీమతికి ఆశపుట్టింది.

'ఏమండీ... కారు చవగ్గా ప్లాట్లు అమ్ముతున్నారటండీ ! మనం కూడా ఒకటి తీసుకుని బ్యాంకు లోనుతో చిన్న ఇల్లు కట్టుకుందామా?' పక్కనేవున్న నన్ను మోచేత్తో పొడిచి మరీ అడిగింది ఆశాలత.

కట్టు చీరెతో కాపరానికొచ్చింది ఆశాలత ! పుట్టింటివారు వెరీపూర్. పిల్ల చక్కగా వుందనేసి కట్నం లేకుండా పెళ్లి చేసుకుని ఏడాది తిరక్కముందే మగపిల్లాడికి తల్లి అయింది. నాకు ప్రమోషనొచ్చింది. జీతం హోదా పెరిగాయి.

ఇదిగో 'కారు' చౌకో... 'సైకిలు' చౌకో నాకు తెలీదు. ఇదంతా రాజకీయాలు !... రెండేళ్లలో ఎన్నికలు రాబోతున్నాయ్ కదా? ఇదొక ఎత్తుగడేమోనే ! ఓటర్లను వెర్రివెధవలను చేయటానికిదొక ప్రయత్నంకాబోలు...' నా మనసులోవున్నది చెప్పాను.

'మీరెప్పుడూ ఇంతే! నెగెటివ్‌గానే ఆలోచిస్తారు. వాళ్లిచ్చిన మొబైల్‌కి మనం ఫోన్ చేస్తే ఏంపోతుంది?' దీర్ఘాలు తీసింది.

'జంటనగరాల్లో ప్లాట్లు అమ్మకాలు... కొనుగోళ్లు అంటే పెద్ద తలనొప్పి ! అన్నీ బినామీలే !. ఒక్కోప్లాటు పాతికమందికి అమ్మేసి సొమ్ము చేసుకుంటారు. తీరా కొని వెంటనే ఇల్లు కట్టుకోలేకపోతే స్థలం కాస్త గోవింద !. అట్లా 'కబ్జా' కి గురైనవి కోకొల్లలు !... మనకెందుకొచ్చిన గోల ? నోరు మూసుక్కూర్చుంటే పోదూ?...' అద్దె కొంపలోనే హరీ అందాం ! కోరికవున్న వారందరికీ ఇళ్లున్నాయా ? మాటలతో మెత్తగ శ్రీమతికి వాతపెట్టాను...

'మనకు స్వంత ఇంటి యోగం లేరేమో?' పైటతో కళ్లొత్తుకుంది ఆశాలత.

'మీరు బైటికెళ్లి ఆ నెంబర్‌ను కాంటాక్ట్ చేసి వివరాలు తెల్సుకుని నాతో చెప్పక పోయారంటే... రాత్రికి పొయ్యిలో పిల్లిలేవదు. ఆతర్వాత మీ ఇష్టం...' పళ్లునూరింది.

ఇక లాభంలేదనుకుని బైటకెళ్లి అర్ధగంటలో తిరిగొచ్చాను.

'అప్పుడే వచ్చారేంటి? వాళ్లతో ఫోన్లో మాట్లాడారా లేదా?'

'ఓసి నా రాకాసి పెళ్లామా... మాట్లాడానే... మాట్లాడాను.'

'ఏమన్నారు?'

'ఫోన్‌లో విషయాలు చెప్పటం కుదరదు. పర్సనల్‌గా వచ్చి తెల్సుకోమంటూ ఇంటి అడ్రసు చెప్పారు. నోట్ చేసుకున్నాను'

'అదిసరే ఎంత సైజు ప్లాట్లు ? ధరెంత ? సిటీకి ఎంతదూరంలో వున్నాయో ఆ విషయాలైనా అడక్కపోయారా...?'

'ఆ పప్పులేం వుడకలేదు. ఆయన ఫోన్ కట్‌చేశాడు'

'అలాగా ?... అయితే ఇల్లు వెతుక్కుంటూ వెళ్లి వివరాలు తెల్సుకురండి. అంతవరకు నో ఫుడ్...'

'ఆయన చెప్పిన అడ్రసుకు పోవాలంటే మూడు సిటీబస్సులు మారాలే !... రెండు కిలోమీటర్లు నడిస్తేగాని ఆ ఇంటికి పోలేం. ఉన్నఫళంగ పోయి రమ్మని నా ప్రాణం తియ్యకే... నీకు దణ్ణం పెడతాను... నాకు ఆకలిగావుంది...' నీరసంగ మాట్లాడాను.

'అయితే వంటచేసి వడ్డిస్తాను. మింగి బయల్దేరండి'

గంగిరెద్దులా తలూపాను.

తిండితిని సరిగ్గా మధ్యాహ్నం వంటిగంటకు ఆ ఎడ్రసు కనుక్కోవటానికి బయల్దేరాను.

అప్పుడనగా వెళ్లినవాడ్ని... పని పూర్తిచేసుకుని తిరిగి ఇల్లు చేరుకునేసరికి రాత్రి పదిగంటలైంది. బాగా అలిసిపోయి వున్నాను. అసలెందుకు వెళ్లాన్రా దేవుడా అనుకోవలసివచ్చింది.

నా రాక కోసం వళ్లంతా కళ్లు చేసుకుని చూస్తోంది ఆశాలత. నన్ను చూడగానే ఒక్క అంగలో నన్ను సమీపించి వెళ్లినపని పండా? కాయా?-' అడిగింది.

'రెండూకాదు చెవిలో పువ్వయింది..'

'అంటే...' విస్తుపోయింది.

'మనం వూహించుకున్నదొకటి ! తీరా అంతదూరం వెళ్లాక తెలిసింది మరొకటి ! ఏం చెప్పను?.. ఏడుపొక్కటే తక్కువ!'

'అసలేమైందో విషయం చెప్పండి' అసహనంతో గావుకేకపెట్టింది.

'చెప్తాలే... అరవకు !.... తీరా వెళ్లివచ్చాక చెప్ప చస్తానా !. టి.వీ. లో యాడ్ ఇచ్చిన పెద్దమనిషి ఎనభైయ్యేళ్ల వృద్ధుడు. ఆయనొక సుప్రసిద్ధ రచయిత గతంలో ఆయన రాసిన పుస్తకాలు ఎన్నో పబ్లిష్ అయినయ్యంటూ తన లైబ్రెరీ అంతా చూపించాడు. ఆయన కథలు... నవలలు... వ్యాసాలు... అచ్చువేయని పత్రికంటూ లేదట ఆంధ్రప్రదేశ్‌లో. రచనలు ఎన్నో అనేక ఇతర భాషల్లోకి అనువదింపబడ్డాయట కూడా ! ఆయన చాలా గ్రేట్ పర్సన్ ! ఇప్పుడాయనకు వయసైపోవటంతో ఇంకా రాసే ఓపికలేదట ! మనసులో ఎన్నో ఆలోచన్లు వున్నాయన్నాడు. వాటి పాయింట్స్ రాసివుంచాడట!. ప్లాట్స్ అంటే ఇళ్ల స్థలాలనుకుని మనం పొరపాటుపడ్డాం !... రచయితలెవరికైనా రాయాలని ఆసక్తి వుండి కొత్త కథలను రాయలేకపోతే... తనవద్ద కథలకు సంబంధించిన ప్లాట్లు వున్నాయని... వాటిని తన వద్దనుండి చవకగా కొనుక్కోవచ్చనేది టీ.వీ. లో వచ్చిన ప్రకటన ఆంతర్యంట !... దూలతీరిందా? పద... భోజనం వడ్డించు... రెండు ముద్దలు మింగి నిద్రపోవాలి... బాగా అలసిపోయాను...' విడమర్చి ఆశాలతకు చెప్పాను.

నా మాటలు విన్నాక వళ్లు మండి 'ఓరి వీడి అమ్మ కడుపు కాలిపోనూ... ఆ ముసలాడి తెలివి ఏడ్చినట్టే వుంది. అనవసరంగా కన్ఫ్యూజ్ చేసిచచ్చాడు...' శాపనార్థాలు పెడుతూ డైనింగ్ టేబుల్ వైపు నడిచింది.

శ్రీమతి వెనుకే నేనూ నడిచాను !.

--- సమాప్తం ---